సాక్షి
బాపట్ల
శనివారం । 24 । జూన్ । 2023



అసిస్టెంట్ కలెక్టర్లకు శిక్షణ

తాడేపల్లిరూరల్ : అసిస్టెంట్ కలెక్టర్లు తొమ్మిది మందికి విపత్తుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక రాష్ట్ర విపత్తుల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.



ఖైదీలకు వైద్య పరీక్షలు

గుంటూరు లీగల్: సుభిక్ష, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య బృందం శుక్రవారం గుంటూరు జిల్లా జైలులోని ఖైదీలకు పరీక్షలు చేసింది. రక్త నమూనాలు సేకరించింది.

పెదకోనేరులో గణేశ్ విగ్రహం



మంగళగిరి: శ్రీలక్ష్మీ నృసింహస్వామి పెద కోనేరు పూడికతీసే క్రమంలో శుక్రవారం వినాయకుని విగ్రహం బయట పడింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి (ఆర్కే) వినాయక విగ్రహాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీలో గ్రూపు పురాణి

● పచ్చ పార్టీలో రచ్చ ● రోడ్డెక్కిన తమ్ముళ్ల తగవులు ● అన్ని నియోజకవర్గాల్లోనూ అదే స్థితి

సాక్షిప్రతినిధి,బాపట్ల: ప్రతిపక్ష టీడీపీలో వర్గవిబేధాలు భగ్గుమంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ముఖ్యనేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకరంటే మరొకరికి గిట్టడంలేదు. ఆధిపత్యపోరులో అమీతుమీకి సిద్ధపడుతున్నారు. ఒకరిపై మరొకరు దాడులకు తెగబడుతున్నారు. రేపల్లెలో ఇటీవల సొంత పార్టీ నేతనే హత్యచేసిన విషయం అందరికీ తెలిసిందే. చాలా నియోజకవర్గాల్లో తమ్ముళ్ల మధ్య విబేధాలు పతాకస్థాయికి చేరాయి. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఓవర్గం నేతలకే కొమ్ము కాస్తుండడంతో ప్రత్యర్థి వర్గం దీనిని వ్యతిరేకిస్తోంది. ఇన్‌చార్జ్‌ల తీరుపై ఫిర్యాదులు అందుతుండటంతో అధిష్టానం సతమతమవుతున్నట్లు తెలుస్తోంది.



పర్చూరు ఎమ్మెల్యేపై దూషణలు

తాజాగా పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడులో మండల టీడీపీ నేతలు వర్గాలుగా విడిపోయి సొంత పార్టీ ఫ్లెక్సీలనే చింపివేసి ఎమ్మెల్యేపై దూషణలకు దిగారు. ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం మండలాల పరిధిలోని పలువురు సీనియర్ నేతలు టీడీపీతో అంటీముట్టనట్లుగా ఉన్నారు. వారందరూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వ్యతిరేకిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలో విబేధాలు తారాస్థాయికి చేరడంతో పార్టీ అధిష్టానం తల పట్టుకుంటోంది. రాబోయే ఎన్నికల్లో ఓవర్గం పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి ఉండడంతో ఆందోళన చెందుతోంది. కొందరు నేతలను పిలిపించి మాట్లాడినా సర్దుకునేందుకు వారు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఏదో ఒకవర్గమే ఉండాలని, ప్రత్యర్థులు ఉంటే తాము పార్టీని వీడుతామని కొందరు కీలకనేతలు అధిష్టానానికి అల్టిమేటం జారీచేస్తున్నట్లు సమాచారం.

చీరాలపై అధిష్టానం అంతర్మథనం

చీరాల నియోజకవర్గంలో ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎం.ఎం.కొండయ్యను ఆ పార్టీలోని చాలామంది నేతలు వ్యతిరేకిస్తున్నారు. అభ్యర్థిని మార్చాలని ఏకంగా చంద్రబాబు, లోకేష్‌లకు ఫిర్యాదు చేస్తున్నారు. మంగళగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ కాంద్రు శ్రీనివాసరావు, చీరాలకు చెందిన డాక్టర్ సజ్జా హేమలత రాబోయే ఎన్నికల్లో చీరాల టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. ఇక పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు డేటా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్రకార్యదర్శి గొడుగుల గంగరాజు సీతసీ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవి కుమార్‌తోపాటు నియోజకవర్గంలోని పలువురు నేతలు, కార్యకర్తలు కొండయ్య అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఏంచేయాలో అర్థంకాక టీడీపీ అధిష్టానం అంతర్మథనంలో పడింది.

ఆనందబాబుపై వ్యతిరేకత

వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండలంలో మాజీ ఎంపీపీ కనగాల ముధుసూదనరావు టీడీపీ ఇన్‌చార్జ్ నక్కా ఆనందబాబుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఇన్‌చార్జిగా ఆనందబాబు ఉన్నా మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు పెత్తనం చలాయిస్తున్నారు. దీంతో విజయబాబుకు, మధుసూదనరావుకు మధ్య వర్గ విబేధాలు పతాకస్థాయికి చేరాయి. గతంలో ఇద్దరి మధ్య గొడవలు తీవ్రమై దాడులు చేసుకున్నారు. మధుసూదనరావు గాయపడ్డారు. దీంతోపాటు మండలస్థాయిలో ఆనందబాబుకు దగ్గరగా ఉంటున్న మాజీ ఎంపీపీ మైనేని మురళి, మధుసూదనరావుకు మధ్య కూడా విబేధాలున్నాయి. ఈ నేపథ్యంలో మధుసూదనరావు వర్గం ఇన్‌చార్జ్ ఆనందబాబుపై తీవ్ర వ్యతిరేకతతో ఉంది. అమృతలూరులోనూ టీడీపీలో వర్గ విబేధాలున్నాయి. ఇక్కడ మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, మాజీ జెట్పీటీసీ చరణ్‌గిరి రెండు వర్గాలుగా విడిపోయారు. ఇన్‌చార్జ్ ఆనందబాబు మాజీ జెట్పీటీసీకి మద్దతు పలుకుతుండడంతో రత్నప్రసాద్ వర్గం ఇన్‌చార్జ్‌కి వ్యతిరేకంగా ఉంది. భట్టిప్రోలు మండలంలో తూనుగుంట్ల సాయిబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు మధ్య వర్గపోరు నడుస్తోంది. దీంతో కరుణ వర్గం ఇన్‌చార్జ్‌ని వ్యతిరేకిస్తోంది.

వర్మపై తిరుగుబావుటా

బాపట్ల నియోజకవర్గంలో గతంలో టీడీపీలో ఉన్న అన్నం సతీష్ వర్గాన్ని ప్రస్తుత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్రవర్మ దూరంపెట్టారు. సతీష్ ఉన్న సమయంలో టీడీపీ కోసం కీలకంగా పనిచేసిన పట్టణ అధ్యక్షుడు తానికొండ దయాబాబు, పార్టీ మండల అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డిని వర్మ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పక్కన పెట్టారు. దీంతో ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు వర్మను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కర్లపాలెం మండలంలో మాజీ జెట్పీటీసీ గుంపుల కన్నయ్య, మైనారిటీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు మహ్మద్ అజీజుల్లాబేగ్, మాజీ ఎంపీటీసీ ఎస్‌కే బాజి, పార్టీ కర్లపాలెం పంచాయతీ అధ్యక్షుడు వసంతారెడ్డితో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా ఒక వర్గం వర్మను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సతీష్ సామాజికవర్గంలో చాలావరకు నేతలు వర్మ నాయకత్వాన్ని ఇష్టపడటం లేదు.

రేపల్లెలో హత్యారాజకీయాలు

రేపల్లె టీడీపీలో విబేధాలు భగ్గుమంటున్నాయి. ఇటీవల రేపల్లె పట్టణానికి చెందిన కమ్మ సామాజికవర్గం నేత రామకృష్ణను సొంత పార్టీ నేతలే హత్యచేశారు. ఆధిపత్య పోరులో భాగంగానే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఆ పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఓ వర్గం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ను వ్యతిరేకిస్తోంది. రాబోయే ఎన్నికల్లో వర్గపోరు ఇబ్బందికరమేనని చర్చ జరుగుతోంది.

అద్దంకిలో వర్గవిభేదాలు అధికం

అద్దంకి నియోజకవర్గం టీడీపీలో నేతల మధ్య విబేధాలు నెలకొన్నాయి. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వద్ద కొందరికే ప్రాధాన్యం దక్కుతుండటంతో మిగిలిన నేతలు దీనిని వ్యతిరేకించి విభేదించారు. ప్రధానంగా సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి తదితర మండలాల పరిధిలో వర్గవిబేధాలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ సంతమాగులూరు మండల మాజీ అధ్యక్షుడు నాగబోతు రామాంజనేయులు, కొరిశపాడు మాజీ జెడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య మరికొందరు నేతలు ఇప్పటికే పార్టీని వీడి అధికార వైఎస్సార్ సీపీలో చేరారు. మరికొందరు చేరేందుకు సిద్ధమవుతున్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● లారీని ఢీకొన్న కారు
● ఒకరు మృతి, 9 మందికి గాయాలు
● అందరూ బాపట్ల జిల్లా వాసులే
● నెల్లూరు జిల్లాలో ఘటన



ప్రసన్నాంజనేయులు మృతదేహం

మనుబోలు: తిరుమలకు దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి ముందువెళ్తున్న లారీని ఢీకొట్టింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కాగితాలపూరు వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందారు. 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు, పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన కయ్యాల పిచ్చయ్య, కొప్పోలు కోటేశ్వరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన కారులో దైవదర్శనానికి తిరుమలకు వెళ్లారు. దైవదర్శనం చేసుకుని శుక్రవారం వేకువన తిరుగు ప్రయాణమయ్యారు. కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలోకి వచ్చేసరికి ముందు హైవేకు కుడివైపున వెళ్తున్న లారీ డ్రైవర్ రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపేందుకు ఒక్కసారిగా ఎడమవైపునకు తిప్పడంతో కారు అదుపుతప్పి వెనుకగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న కయ్యాల ప్రసన్నాంజనేయులు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ గాలి రాజు, కయ్యాల పిచ్చయ్య, కయ్యాల విష్ణు, కయ్యాల పవన కుమారి, కయ్యాల సునీల్, కొప్పోలు కోటేశ్వరరావు, కొప్పోలు లక్ష్మి, కొప్పోలు సాయిమనోజ్, కొప్పోలు మేఘువర్షిత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యూస్‌రీల్

సివిల్ ర్యాంకర్‌కు సీఎం వైఎస్ జగన్ అభినందనలు



మార్టూరు: ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 311వ ర్యాంకు సాధించిన మార్టూరుకు చెందిన వీరగంధం లక్ష్మీసుజితను శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. సివిల్స్ ఫలితాల్లో రాష్ట్రంలో మెరుగైన ఫలితాలు సాధించిన ఉత్తమ ర్యాంకర్లను తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఆమె వెంట తల్లిదండ్రులు మార్టూరు శ్రీనివాస విద్యాసంస్థల అధినేత వీరగంధం శ్రీనివాస రావు, భవానీ ఉన్నారు.

377 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్స్



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 377 మంది ఉపాధ్యాయులు పోస్టింగ్స్ పొందారు. 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను ప్రభుత్వం ఇటీవల మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై ఉపాధ్యాయులుగా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా వారికి ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. 227 మంది 98 డీఎస్సీ, 150 మంది 2008 డీఎస్సీ అభ్యర్థులకు పాఠశాలలను కేటాయించారు.

యార్డులో 30,012 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,331 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,012 బస్తాల అమ్మకాలు జరిగాయి.

- నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24 వేలు పలికింది.
- నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేలు నుంచి రూ.25 వేలు పలికింది.
- ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.16,500 నుంచి 22 వేలు ధర లభించింది.
- ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,500 నుంచి రూ. 24,500 వరకు ధర పలికింది.
- తాలు రకం మిర్చికి రూ.6 వేలు నుంచి రూ.14 వేలు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,358 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.900, గరిష్ఠ ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.60 అడుగుల వద్ద ఉంది.



రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలి

● రాత్రిపూట బీట్ వ్యవస్థ పటిష్టపర్చాలి
● సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
● జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో శుక్రవారం ఈబీట్స్ విధానంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాత్రిపూట నిర్వహించే బీటు వ్యవస్థను మరింత పటిష్టపర్చాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు చేయగలమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీసుకు వచ్చిన ఈబీట్ విధానాన్ని ప్రతి ఒక్కరూ అమలుచేయాలన్నారు. రాష్ట్రంలోనే మొదటగా బాపట్ల జిల్లాలో ఈ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క పోలీస్ సిబ్బంది దానిని వారి మొబైల్ ఫోన్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ విధానం వలన రాత్రి సమయంలో మరింత మెరుగ్గా బీటు తిరగవచ్చని, దానిలో పాత నేరస్తుల జాబితా, నేరాలు జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతాల జాబితా, ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఈ అప్లికేషన్ ద్వారా ఫొటో గాని, వీడియో గాని, మెసేజ్‌లపై అధికారులకు పంపే అవకాశం ఉంటుందన్నారు. సంఘటనా స్థలానికి చేరుకోవటానికి కూడా జీపీఎస్ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఏదైనా నేరం జరిగితే ఒకే సమయంలో మిగిలిన బీట్లు వారిని మిగిలిన పోలీస్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం చేరవేసే అవకాశం ఉందని, ఇటువంటి సాంకేతికతను ప్రతి ఒక్కరూ పూర్తిగా ఉపయోగించుకొని తద్వారా జిల్లా ప్రజలకు మరింత మెరుగైన భద్రత కల్పించగలమన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ దొరికితే కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని రౌడీషీటర్ల కదలికలను నిశితంగా పరిశీలిస్తూ వారికి సరైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ బాలమురళీ, ఐటీకోర్ ఎస్ఐ సీజే భరత్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

పంట ఉత్పత్తుల పెంపునకు ప్రణాళిక

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: పంటల ఉత్పత్తుల పెంపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుదామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. సాగునీరు విడుదలవుతున్నందున సేద్యానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని చెప్పారు. ఇప్పటికే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి సచివాలయంలో నిర్వహిస్తున్నందున ఎనిమిది వేల సీసీఆర్‌సీ కార్డులు జారీకి సిద్ధం చేశామన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో అరికట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టాలన్నారు.

28,611 టన్నుల ఎరువులు సిద్ధం

ఖరీఫ్ సీజన్లో 61,766 టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 28,611 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉంచామని కలెక్టర్ బాషా చెప్పారు. ఏడు రకాల పంటల కోసం విత్తనాలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో 75 కిసాన్ డ్రోన్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ప్రస్తుతం 17 డ్రోన్లు ఇవ్వడానికి శిక్షణలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులకు అభినందన

గతేడాది పంటల నమోదు, మద్దతు ధరకు కొనుగోలు, బీమా నష్ట పరిహారం పంపిణీలో వ్యవసాయశాఖ అధికారుల పనితీరును కలెక్టర్ బాషా ప్రత్యేకంగా అభినందించారు. తాగు, సాగునీటి అవసరాల కోసం 45.8 టీఎంసీల పశ్చిమకృష్ణా జలాలు జిల్లా అవసరాల నిమిత్తం సెప్టెంబర్ వరకు విడుదలవుతాయని చెప్పారు. కందులు, మొక్కజొన్న, రాగి పంటల ఉత్పత్తి పెరగడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పూల సాగు విస్తీర్ణం తగ్గడంపై ఆరా తీశారు. నాణ్యమైన విత్తనాలు అందడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తెగులు వంటివి సోకకుండా పంటల పరిశీలనకు శాస్త్రవేత్తలను పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా,ఎమ్మెల్యే కోన రఘుపతి

కందులు, రాగి పంటలను కొంటాం

కందులు, మొక్కజొన్న, రాగి పంటలను ఇప్పటినుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఈ పంటల విస్తీర్ణం జిల్లాలో పెంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 691 హెక్టార్లలో కంది పంట సాగవుతుండగా, మూడు వేల ఎకరాలకు విస్తీర్ణం పెంచడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అలాగే మొక్కజొన్న, రాగి పంటలు విస్తీర్ణం పెంచాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దశరథ మహారాజు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, పశు సంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, మత్స్య శాఖ అధికారి పి సురేష్, ఉద్యాన శాఖ ఏడి జన్నమ్మ, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి సేద్యమే లక్ష్యం కావాలి

లాభసాటి సేద్యమే లక్ష్యం కావాలి. వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలి. కర్షకులకు మార్గదర్శనం చేయాలి. డిమాండ్‌కు అనుగుణంగా వరి విత్తనాలను అందుబాటులో ఉంచాలి. పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. ఆక్వా రైతులు తమ ఉత్పత్తులను శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలి. గిడ్డంగుల సామర్థ్యం పెంచాలి. సాగునీరు సాఫీగా సరఫరా చేయాలి.

– కోన రఘుపతి, ఎమ్మెల్యే, బాపట్ల

ఆర్‌బీకేల ద్వారా కంది విత్తనాలు పంపిణీ చేయాలి

రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)ల ద్వారా కంది విత్తనాలు పంపిణీ చేయాలి. నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తే డెల్టా ప్రాంతాలలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. బాపట్ల జిల్లాలోని శీతల గిడ్డంగుల సామర్థ్యం పెంచాలి.

– దశరథ మహారాజు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేద్దాం

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ఈనెల 24 నుంచి జిల్లాలోని అన్ని మండలాల సచివాలయాల పరిధిలో జరుగుతుందని, దీనిని జయప్రదం చేద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై డివిజన్, మండలస్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన మాట్లాడారు. అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పరిపాలన వ్యవస్థను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకువెళ్లడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. వలంటీర్లు తమకు నిర్దేశించిన ప్రతి ఇంటినీ తప్పనిసరిగా సందర్శించాలన్నారు. మొత్తం 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రజలకు ప్రాధాన్యక్రమంలో టోకెన్ నంబర్లు ఇవ్వాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి ధ్రువీకరణపత్రాల జారీ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు విధిగా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. అనంతరం జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. సమావేశంలో జేసీ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నేస్తం సీఎం జగన్

మాచర్ల: ''ఉద్యోగుల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలతతో స్పందిస్తున్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసి మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలి. సీఎం జగన్‌కు అండగా నిలవాలి'' అని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. గురువారం రాత్రి వీవీఎన్ గార్డెన్స్‌లో ప్రభుత్వ ఉద్యోగ, వివిధ సంఘాల నాయకులతో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పీఆర్కే, పీవీఆర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



గజమాలతో కలెక్టర్ శివశంకర్, ప్రభుత్వ విప్ పీఆర్కేలను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

● పాఠశాలల్లో క్షేత్రస్థాయి ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు
● జెడ్పీస్థాయీ సంఘ సమావేశంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు భేటీ అయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్లో 1, 2, 4, 7వ స్థాయి సంఘ సమావేశాలకు హెనీ క్రిస్టినా అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో గొప్పదని చెప్పారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు సకల వసతులతో తీర్చిదిద్దడం ద్వారా పెద్ద సంఖ్యలో విద్యార్థులతో కళకళలాడుతున్నాయని కొనియాడారు.

అనంతరం ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరే సమ్మ మాట్లాడుతూ తమ ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయని, ఇప్పటి వరకు గుంటూరు సబ్‌స్టేషన్ నుంచి జరుగుతున్న సరఫరాను నరసరావుపేటకు మార్చడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్‌బేగం కూడా విద్యుత్ కోతలపై మాట్లాడారు. జోక్యం చేసుకున్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ తమకూ విద్యుత్‌కోతల ప్రభావం ఉందని వివరించారు.



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

పల్నాడులో ఉపాధ్యాయుల కొరత

విద్య, వైద్యంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని మారుమూల మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని వివరించారు. ఎంఈవో-2 పోస్టులను హెచ్‌ఎంలతో భర్తీ చేయడంతో హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా మారాయని, వాటినీ దిగువ శ్రేణి టీచర్లతో భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 23 శాతం జెడ్పీ సాధారణ నిధులతో రోడ్లు, కాలువలు, తాగునీటి పథకాలకు సంబంధించిన 45 పనులను రూ.1.65కోట్లతో చేపట్టేందుకు హెనీ క్రిస్టినా ఆమోదించారు. ఆరు శాతం ఎస్టీ పద్దు నుంచి యడ్లపాడు మండలం సొలస గ్రామంలో రూ.10 లక్షలతో కల్వర్టు, రెంటచింతల మండలం పాలువాయిలో రూ.ఎనిమిది లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నారు. నిజాంపట్నం, దుగ్గిరాల మండలాల్లో రూ.18 లక్షలతో ఓపెన్ డ్రెయిన్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాల పనులకు ఆమోదం తెలిపారు.

జగనన్న ఊళ్లనే నిర్మిస్తున్నాం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలు జగనన్న కాలనీలో పర్యటన
- లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మంత్రి
- అభివృద్ధి చూసి ఓర్వలేక విపక్షాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు



జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: రాష్ట్ర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలను ఇచ్చి గృహాలు నిర్మించుకునేందుకు కావాల్సిన మెటీరియల్‌ను సరఫరా చేయడమే కాక అదనంగా రుణాలు ఇప్పిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలులోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ మహిళల చిరునవ్వే జగనన్న లక్ష్యమని అన్నారు. ఈ లే-అవుట్లలో ప్రస్తుతం మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించామని తెలిపారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. లే-అవుట్లలో అన్ని వసతులు సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావచ్చని ఒక్క ఫోన్ కాల్ చేసినా వెంటనే మీ ముందు ఉండి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నా రు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో ఒక ఊరినే నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక లబ్ధిదారులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాజకీయం చేయవద్దని టీడీపీ నాయకులకు మంత్రి హితవు పలికారు. జరుగుతున్న అభివృద్ధిపై టీడీపీ నాయకులు చర్చకు ఎప్పుడైనా ఎక్కడైనా సిద్ధమేనని ఛాలెంజ్ చేశారు. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్ (ఉప్పు కాల్వ) అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కివారిపాలెం రోడ్డు బ్రిడ్జి నుంచి వెల్లటూరు ఛానల్ అక్విడెక్ట్ వరకు రూ.31.86 లక్షల వ్యయంతో పూడికతీత పనులను చేపట్టారు. కనగాల అప్లాండ్ కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తూటికాడను తొలగించాలని మంత్రి డ్రెయినేజీ అధికారులకు సూచించారు. గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు పీజీ అరుణ్‌శాస్త్రి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం(చిన్నారి), దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజీ, దాసరి ఫణీంద్ర, మోర్ల కోటేశ్వరరావు, కొలుసు శ్రీనివాసరావు, కుక్కల వెంకట్రామయ్య, సయ్యద్ నజీర్, పంతఈత పి.వెంకటరత్నం, డెప్యూటీ డీఈలు ఎం.అనీల్‌కుమార్, ధనలక్ష్మి, ఏఈలు పాల్గొన్నారు.

సంక్షేమం అందని వారికోసమే జగనన్న సురక్ష

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని లబ్ధిదారుల కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దమనస్సుతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను 90శాతం మంది ప్రజలు లబ్ధిపొందుతున్నారన్నారు. అర్హత ఉండి చిన్నచిన్న సాంకేతిక లోపాల కారణంగా పథకాలను పొందలేకపోతున్న, వివిధ కారణాలతో వివిధ రకాల సర్టిఫికెట్‌లను పొందటంలో ఇబ్బందులు పడతున్న ప్రజలను గుర్తించి వారికి పథకాలను చేరువ చేయటంతోపాటు సత్వరమే కావాల్సిన సర్టిఫికెట్‌లను అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నెలరోజులపాటు జరగనున్న కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాలలో పర్యటించి గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించి పథకాలను చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరి ప్రజలందరికి పథకాలు చేరేలా పనిచేయాల్సిన బాధ్యత తమందరిపై ఉందని తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు గుజ్జర్లమూడి విజయబేబి ఇమ్మానియేలు, ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్‌బాబు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం వైద్యాధికారిపై విచారణ

వేటపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్‌రావుపై వచ్చిన పలు ఆరోపణలపై ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి శుక్రవారం విచారణ నిర్వహించారు. వేటపాలెం మండలం జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి మార్చి 27వ తేదీన వైద్యాధికారి ప్రభాకరావు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మండలం కేంద్రంలో నివాసం ఉండకుండా ప్రతి రోజూ గుంటూరు నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని, వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలు ఆరోపణలతో జిల్లా కలెక్టర్ విజయకృష్ణకి ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. సిబ్బందిని విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందించనున్నట్లు తెలిపారు. విచారణలో వైద్యాధికారిపై వచ్చిన ఆరోపణలు నిరూపణ జరిగిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.